బిడ్డగాళ్లు

- ఎస్.వెంకటదత్

నేను వెళ్లాల్సిన రైలు గంటన్నర ఆలస్యం. ఉసూరుమంటూ ఒక బల్లమీద కూర్చుని పుస్తకం తెరిచాను. ఎవరో వచ్చి ఎదురుగా నిలబడ్డారు. పుస్తకంలో మునిగిన నాకు అర్థమవుతోంది. ఎవరో ... కచ్చితంగా నా కోసమే నా ఎదుట నిలిచారని. పుస్తకంలో నుండి తల తిప్పకుండానే ఆలోచించాను. ఎవరై ఉంటారా అని.

అప్పు డనిపించింది 'రైల్వే స్టేషన్లలో ఇలా నిశ్శబ్దంగా ఎదురుగా వచ్చి నిలిచేవాళ్లు, 'దేహి' అని చేతులు చాస్తూ అడుక్కునే బిచ్చగాళ్లు తప్ప ఇంకెవరై ఉంటారు?' అని.

'మీకు కావలసిన విధంగా మాత్రం నడవము' అనే రైళ్లతో, 'మాకు కావలసిన విధంగా మాత్రమే పనిచేయా'లనే పైళ్లతో విసిగిన నేను, కొద్దిసేపు హాయిగా చదువుకుందామంటే దానికి ఆటంకం కలిగించే ఈ బిచ్చగాడి మీద ఒళ్లు మండింది. అదే ఉక్రోషంతో తలెత్తి చూశాను. నా ఆలోచన నిజమే. ఎదురుగా బిచ్చగాడు! కాని నా ఉక్రోషం, కోపం చప్పున మాయమైనాయి.

పదకొండు ఏళ్లు ఉంటాయేమో ఆ పిల్లవాడికి. మొహంలో పసితనం స్పష్టంగా కనిపిస్తోంది. చామనచాయగా, ఆకర్షణీయంగా ఉన్నాడు. కళ్లు చాలా చురుకుగా ఉన్నాయి. కాని దైన్యం, నిస్సహాయత నిండుకొని ఉన్నాయి. వాడికి నోటి వెంట మాట పెగలటంలేదు. చేతిని నోటి వైపు చూపించి, ఎంతో కొంత ఇవ్వమంటున్నట్లు సైగ చేస్తున్నాడు. ఒంటిమీద బట్టలను పరిశీలించాను. చిరుగులు లేవు గాని, బాగా మాసి ఉన్నాయి. బిచ్చమెత్తాల్సిన అవసరం లేకుండానే ఆపనికి అలవాటు పడ్డాడేమో అనిపించింది.

"ఎందుకురా అడుక్కుంటున్నావు?" అని అడిగాను. మళ్లీ అదే సైగ — 'తిండి కోసం' అన్నట్లుగా చేతిని నోటి దగ్గర పెట్టుకున్నాడు. తిండి తినటానికి అడుక్కోవటమే శరణ్యమా ఏమిటి? ఏదైనా పనిచేసుకుంటే కడుపు నిండదా? అయినా ప్రతి అడుక్కునేవాడూ ఇదే సమాధానం చెబుతున్నాడు. ఏదైనా పని చేసుకోవచ్చు కదా అంటే ఏ పనీ దొరకటంలేదని చెబుతున్నారు. పని ఇప్పిస్తాను రమ్మంటే మాత్రం కంటికి కనిపించకుండా పారిపోతారు. నాకు తెలిసి అలా పారిపోయిన వాళ్లు చాలామంది ఉన్నారు. ఇలా అడుక్కోవటం బాగా తేలికగా ఉందనుకుంటాను. అందుకే వాడే పారిపోతాడులెమ్మని — "పని చేస్తావా?" అని అడిగాను.

ఆ మాట వినగానే వాడి కళ్లలో మెరుపు చూసి ఆశ్చర్యపోవటం నా వంతు అయింది.

"చేస్తాను" అన్నట్లు తలూపాడు.

ఆశ్చర్యంతో, బెరుకుతో "ఏ పనైనా చేస్తావా?" అన్నాను.

వాడు ఆనందం నిండిన కళ్లతో, ఇక తన బాధలు తీరాయన్నట్లు ఆశగా ఒకఅడుగు ముందుకు వచ్చాడు. వాడికి పని ఇవ్వడానికి నా దగ్గ రేముంది?

అంతే! మళ్లీ మాట మార్చాను.

"అసలు ను వ్వెందుకురా అడుక్కుంటుంది?"

మళ్లీ అదే సైగ. వెధవది కడుపు నింపుకోవటానికి అడుక్కోవాలా? అందులోనూ ఈ వయసులో! పిల్లలకు కూడు పెట్టని తల్లిదండ్రు లుంటున్నారా ఈ దేశంలో! అదే అడిగాను వాడిని.

"అమ్మా, నాన్నా లేరట్రా నీకు?"

వాడి కళ్లలో నేను అందుకోలేని భావాలు ఏవో కదలాడాయి.

"ఉన్నా"రన్నట్లు తలూపాడు.

"మరైతే వాళ్లు నీకు అన్నం పెట్టరా ఏమిటి?" ప్రశ్నించాను.

పూడుకుపోయిన గొంతుతో ఏదో అన్నాడు. నాకు సరిగా వినిపించలేదు — "గట్టిగా చెప్పరా!" విస్సుగ్గా అన్నాను.

"కాళ్లు లేవు, సారూ!" అన్నాడు లో గొంతుకతో.

"ఏమిటీ! కాళ్లు లేవా?!"

వాడి అమాయకపు కళ్ల నుండి కన్నీరు బొటబొటా రాలి, చొక్కాను తడుపుతున్నది. నేను విచలితుణ్ని అయ్యాను. వాడి లేత హృదయానికి ఎంత గాయమైంతో తెలియదు. చాలా కష్టంగా, కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పాడు — "అమ్మా, నాన్నకు కాలు బోయినీ! నడమట్లా!"

"ఏం చేస్తాట్రా వాళ్లు?" నా గొంతుకలో ఆవేదన బయటకు రానీయకుండా అడిగాను.

"ఏం చేరు" అంటూ ఎక్కిళ్లు పెడుతున్నాడు.

నా మనసు కకావికలైంది. "ఏమీ చేయకపోతే వా ళ్లేం తింటారు?" అడిగాను.

"నే దీ స్కెల్లి పెడతా!"

నాకు మతిపోయినంత పనైంది.

"ఏ ఊరు మీది?" చెప్పాడు. అ దో పల్లె. నంద్యాలకు దగ్గర. వాడి మాట తీరు రాయలసీమ పల్లె ప్రజలది. వాడు చెప్పిన ఊరు రాయలసీమకు చెందినది. అంటే ఆ పసివాడు చెబుతున్నది నిజమే. మరికొన్ని వివరాల్ని అడిగాను. చెప్పాడు.

"ఇక్కడ వోటల్ని జేరిన. నెల కో తాలు ఊరెల్లి అమ్మోల్లకి డబ్బు లిస్త. నేను వారం రోజులు రాలేదని ఇంకో పోరగాన్ని తోలుకొచ్చినారాళ్లు. నాకు పని లేదన్రు.'

"పని కోసం ఎదుకుతుండినా. యాడ దొరకలే!"

ఇంకా నే నేదో పని ఇప్పిస్తా ననే ఆశ వాడికి ఉందని నాకు అర్థమైంది. సిగ్గుతో చచ్చిపోయాను.

వాడు ఆకలి తీర్చుకోవడానికే అడుక్కుంటున్నాడని అర్థమైంది. నేను ఏం చేయాలో అర్థం కాలేదు. నాకు తెలిసినంతలో వాడికి పని ఇప్పించే సామర్థ్యం నాకు లేదు. వేల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేస్తున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమాల పరిధిలోకి ఈ పిల్లవాడు రాడేమో! ఇలాంటి సంసారాలకు రక్షణ నివ్వటానికి ఎలాంటి ప్రభుత్వ యంత్రాంగం లేదా? ఆలోచిస్తున్నాను. కాని ఆ పిల్లవాణ్ని అలా నిలబెట్టి ఎంతసేపు ఆలోచించను? జేబులో నుండి ఒక చిన్న నోటు తీసి ఇచ్చి పొమ్మన్నాను వాడి కళ్లలోకి చూడకుండా.

అవును మరి. అంత ధైర్యం నా కెక్కడిది? వాడు నాకు దణ్ణం పెట్టి వెళ్లిపోయాడు. నా మనసు మనసులో లేదు. నేను వాడికి చేసిన సహాయం అతి స్వల్పం అనిపించింది. వాడు ఎటు వెళ్లాడా అని చూశాను. కనిపించలేదు.

ఆ పసివాడు తల్లిదండ్రుల గురించి అంత ఆందోళన పడటం చూసి, ఆస్తుల పంపకాల కోసం తన్నులాడుకునేవారు, తల్లిదండ్రుల కోసం పది రూపాయలు ఖర్చుపెట్టాలంటే లెక్కలు వేసుకునేవారు ఎంత సిగ్గుపడాలో కదా!

బాధ్యతలు లేకుండా హాయిగా ఆడుకోవలసిన వయసులో అంత పెద్ద భారం నెత్తిన వేసుకుని కూడా, నిజాయితీగా బతకాలనుకునే పసిపిల్లవాడు పని దొరకక, ఆకలి కడుపుతో, నిరాశా నిస్పృహలతో, ఈ దేశ ప్రధానమంత్రి నియోజకవర్గంలో వెలితి జీవితం గడుపుతుంటే; మరొకపక్క అన్యాయంగా వేల కోట్ల రూపాయలు స్వాహా చేశానని (బిచ్చమెత్తుకున్నానని) బహిరంగంగా ఒప్పుకుంటూ, దేశ ప్రధానికే కోటి రూపాయలు లంచం ఇచ్చానని ఆరోపిస్తూ, జల్సాగా తిరుగుతున్న బడా బాబులున్న ఈ దేశంలో ఎవరు బిచ్చగాళ్లు? ★

బాలీవుడ్ బాణీ

జర్మనీలోనూ 'హమ్మ హమ్మ'!

ఏ.ఆర్. రహ్మాన్ 'బొంబాయి' సినిమాలో అందించిన ట్యూన్లు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవల బెర్లిన్‌లో ప్రపంచ హాకీ ఛాంపియన్‌షిప్ చూడటానికి వచ్చినప్పుడు 'బొంబాయి'లోని 'హమ్మ హమ్మ' ట్యూన్ వారిని ఇట్టే ఆకట్టుకుంది. అంతేకాదు, ఈ ట్యూన్ కనిపెట్టిన రహ్మాన్ పాకిస్తాన్ హాకీ క్రీడాకారుడని, అతనికి సంగీతం హాబీ అనే ప్రచారం కూడా విపరీతంగా సాగింది. ఈ ప్రచారం వెనుక ఏమిటుందో?

మసూద్ అన్సారి